

ఎన్‌సిసితో క్రమశిక్షణ

నరసాపురం: విద్యార్థులు ఎన్‌సిసిలో చేరడం ద్వారా వారిలో అంకిత భావం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, దేశ భక్తి వంటి ఉత్తమ లక్షణాలు పెంపొందుతాయని ఎన్‌సిసి కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ రితాన్ మోహన్ అగర్వాల్, కాకినాడ గ్రూప్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కల్నల్ సికె.నాయక్ అన్నారు. సీతారాంపురం సౌత్‌లోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల స్థాయి ఎన్‌సిసి మాన్యువల్ ట్రెయినింగ్ క్యాంప్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఎన్‌సిసి క్యాడెట్స్ రూపొందించిన షిప్ మోడలింగ్, సమాపోర్, ముళ్లు వేయడం, డ్రిల్, ఫైరింగ్, బోటింగ్, డ్రిల్ వంటివి పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ సి.రోహిత్ కుమార్, స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ కొండేటి వెంకట సత్యనారాయణ, కోశాధికారి కెవి.స్వామి, కళాశాల, పాలకవర్గ సభ్యుడు అడ్డాల శ్రీహరి పాల్గొన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర యాజమాన్యం కల్నల్ రితాన్ మోహన్ అగర్వాల్, కల్నల్ సీకే నాయక్‌ను సన్మానించారు.



అన్నదాతకు.. వర్షం టెన్షన్..!

రబీలో అకాల వర్షాలతో రైతుల అవస్థలు
చి'వరి'దశలో ధాన్యం కొనుగోళ్లు
ఏలూరు జిల్లాలో 20 వేల టన్నులు, 'పశ్చిమ'లో లక్ష టన్నులు ఇంకా రైతుల వద్దే
ఈదురుగాలులు, వర్షాలకు రైతుల్లో గుబులు
మామిడి రైతుల పరిస్థితి మరింత దారుణం
టన్ను ధర రూ.13 వేల నుంచి రూ.7 వేలకు తగ్గుముఖం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రబీసాగులో అన్నదాత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అకాల వర్షాలు రైతులను వెంటాడటంతో ధాన్యం రైతు అడుగడుగునా నలిగిపోయిన పరిస్థితి నెలకొంది. ధాన్యం కొనుగోలు చివరి దశకు చేరుకున్నప్పటికీ అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రబీలో పశ్చిమలో 2.13 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 80 వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. ఏప్రిల్ రెండో వారం నుంచి ముమ్మరంగా వరి మాసూళ్లు ప్రారంభమయ్యాయి. 'పశ్చిమ'లో తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసిన అధికారులు, ఏడు లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకూ 71,469 మంది రైతుల నుంచి 6.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.1,515 కోట్లు సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఏలూరు జిల్లాలో 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం లక్ష్యం కాగా 2.50 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం కొనుగోలు చేసి రూ.485.62 కోట్లు వరకూ రైతుల ఖాతాల్లో జమ చేశారు. ధాన్యం సొమ్ము మాత్రం 24 గంటలు గడవక ముందే రైతుల ఖాతాల్లో జమ కావడం రైతులకు ఊరటనిచ్చే అంశంగా చెప్పొచ్చు. రబీ ధాన్యం కొనుగోలు ప్రారంభం నుంచి అకాల వర్షాలు అన్నదాతను వెంటాడుతూనే ఉన్నాయి. రెండు, మూడు రోజులకోసారి పెద్దఎత్తున ఈదురుగాలులు, వర్షం రైతులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ధాన్యం కొనుగోలులో టార్గెట్లతో ఏర్పడిన ఇబ్బందులు రైతులను కొంత ఉక్కిరిబిక్కిరి చేసింది. గడిచిన రెండు రోజులుగా వెంటాడుతున్న అకాల వర్షాలతో వరి రైతులు ఇంకా ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా పశ్చిమగోదావరి జిల్లాలో లక్ష టన్నులు, ఏలూరు జిల్లాలో 20 వేల టన్నుల వరకూ ధాన్యం రైతుల వద్దనే ఉంది. కొనుగోలుకు ఇబ్బంది లేకపోయినప్పటికీ మాసూళ్లు కొంత ఆలస్యమైనచోట్ల రైతులు వర్షాలతో ఇబ్బందులు పడుతున్నారు. దెబ్బతిన్న పంటలకు 24 గంటల్లో నష్టపరిహారం ఇవ్వాలని సిఎం చెప్పారు. రెండు జిల్లాల్లో ధాన్యం తడిసినప్పటికీ నష్టం పరిగణనలోకి రాదనే కారణంతో జిల్లా రైతులకు ఎటువంటి పరిహారమూ అందని పరిస్థితి ఏర్పడింది. రబీలో ఈసారి ధాన్యం దిగుబడులు బాగా వచ్చినప్పటికీ అకాల వర్షాలతో రైతులు నానావస్థలు పడ్డారు. చివరి దశలో సైతం తిప్పలు తప్పకపోవడంపై అన్నదాత తీవ్ర ఆవేదనకు గురవుతున్నాడు.

మామిడి రైతులకు కోలుకోలేని దెబ్బ

అకాల వర్షాలు మామిడి రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. ఏలూరు జిల్లాలో దాదాపు 50 వేల ఎకరాల్లో రైతులు మామిడి విస్తీర్ణం ఉంది. ఒక్క నూజివీడు డివిజన్‌లోనే 35 వేల ఎకరాల్లో మామిడి ఉంది. ఈదురు గాలులు, అకాల వర్షాలకు మామిడికాయలు రాలిపోవడంతో రైతులకు తీరని నష్టం ఏర్పడింది. మొన్నటి వరకూ టన్ను మామిడి ధర రూ.13 వేల వరకూ ఉండగా గడిచిన రెండు రోజుల్లో టన్ను రూ.ఏడు వేలకు పడిపోయినట్లు రైతులు చెబుతున్నారు. ధర కోసం ఆగుదామని రైతులు వేచిచూసే పరిస్థితి లేకుండా పోయింది. ఈదురుగాలులకు కాయలు రాలిపోతున్నాయి. దీంతో రైతులు అయినకాడికి అమ్ముకోవాల్సిన దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది అకాల వర్షాలు మామిడి రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. అకాల వర్షాలు వరి, మామిడి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశాయని చెప్పొచ్చు.

నాటుసారా రహిత జిల్లాగా పశ్చిమ

కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రకటన
సమర్థవంతంగా నవోదయం 2.0 కార్యక్రమం

ప్రజాశక్తి - భీమవరం

పశ్చిమను నాటు సారా రహిత జిల్లాగా కలెక్టర్ చదలవాడ నాగారాణి ప్రకటించారు. సారా తయారీదారులకు ప్రత్యామ్నాయ మార్గం నిమిత్తం రూ.13 లక్షలు కేటాయించి లబ్ధి చేకూర్చారు. సారా రహిత జిల్లాగా మారడం ఎంతో సంతోషంగా ఉందని భవిష్యత్తులో జిల్లాలో ఎక్కడా నాటుసారా తయారీ, అమ్మకాలు గానీ దీని నిమిత్తం ఎటువంటి కేసులు గానీ నమోదు కాకుండా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నవోదయం 2.0 (నాటుసారా నిర్మూలన) కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్యఅతిథిగా హాజరు కాగా జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, జెసి టి.రాహుల్‌కుమార్ రెడ్డి, ఎక్సైజ్ డిసి బి.శ్రీలత హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రభుత్వం సారా రహిత రాష్ట్రంగా మార్చాలని నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించి లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. జిల్లాలో సారా తయారీ పూర్తిగా నిర్మూలించినట్లు తెలిపారు. సారా తయారీ, విక్రయాలతో జీవనం సాగించేవారు ఇకపై ఆ పనులు మానుకొని, ప్రత్యామ్నాయంగా ఉపాధి పొందేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలను తయారీదారుల భార్యల పేరున ఆర్థిక సహాయాన్ని సమకూర్చడం జరిగిందన్నారు. జిల్లాలో ఐదు ప్రాంతాల్లో సారా తయారీ, విక్రయం ఉందని, దాన్ని పూర్తిగా నిర్మూలించే దిశగా 13 మంది లబ్ధిదారులను గుర్తించి ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున చెక్కులు అందజేయడం జరిగిందన్నారు. దీంతో పశ్చిమగోదావరి జిల్లాను సారా రహిత జిల్లాగా ప్రకటించినట్లు తెలిపారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ సారా తయారీ, రవాణా, విక్రయాలు కొనసాగించేవారిపై ఇకపై కఠిన చర్యలు ఉంటాయని, తొలుత తహశీల్దార్ వద్ద రూ.లక్ష పూచీకత్తుతో బైండోవర్ చేయడం జరుగుతుందన్నారు. తర్వాత ఏడాది పాటు బెయిల్ రాకుండా పీడీ యాక్ట్ నమోదవుతుందన్నారు. నాటుసారా తయారు చేసినా, రవాణా చేసినా, నిల్వ చేసినా, అమ్మకాలు జరిపినా 14405 టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత మాట్లాడుతూ జిల్లాలో సారా వృత్తిలో ఉన్న వారిని గుర్తించి ప్రత్యామ్నాయ ఉపాధి ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో గుర్తించి 5 గ్రామాల్లో ఇప్పటికే సారాను నిర్మూలించామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి ఆర్‌ఎస్.కుమరేశ్వరన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ నాగ ప్రభుకుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, సిఐలు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్‌పి, జెసి

భారీ వర్షం.. రైతులు విలవిల

మడుగుల్లా రహదారులు
జనం అవస్థలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. వర్షానికి, ఈదురుగాలులకు మామిడికాయలు నేలరాలాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

మండలంలోని మొగల్తూరు, ముత్యాలపల్లి, రామన్నపాలెం, కెపి.పాలెం, పేరుపాలెం తదితర గ్రామాల్లో సుమారు 300 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. గాలుల ప్రభావంతో మామిడికాయలు నేలరాలాయి. దీంతో మామిడి తోటలను కౌలుకు తీసుకున్న రైతులు నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాల ప్రభావంతో కాయలకు తెగులు సోకే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆందోళనలో అన్నదాతలు..

మండలంలో దాళ్వాలో సుమారు 1500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. పంట చేతికందే సమయంలో అకాల వర్షం కారణంగా వరిచేలు నేలనంటాయి. వరి పనలు నీట మునిగాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సుమారు 15 వేల ఎకరాల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. కురిసిన వర్షానికి చెరువుల్లో ఆక్సిజన్ శాతం తగ్గిపోయింది. దీంతోపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఏరియేటర్లు పనిచేయని పరిస్థితి.

వర్షం ప్రభావంతో బడుగులపై ఉన్న ఇటుకలు తడిసి ముద్దయ్యాయి. ఈ వర్షంతో వేళల్లో నష్టం వాటిల్లుతుందని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మడుగుల్లా రహదారులు..

అధిక వర్షాల ప్రభావంతో రహదారులు మడుగుల్లా మారాయి. మొగల్తూరు - శేరేపాలెం రహదారి, మొగల్తూరు నుండి కొత్తపాలెం మీదుగా వెంప వెళ్లే ఆర్‌అండ్‌బి రోడ్డు అధ్వానంగా మారాయి. రామన్నపాలెంలోని రహదారులు ధ్వంసమై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలతో కూడిన వర్షంతో భారీ వృక్షాలు పడిపోయాయి. దీంతో జనం అవస్థలు పడ్డారు.



గొల్లగూడెంలో మడుగును తలపిస్తున్న రహదారి

న్యాయం చేయడమే మా లక్ష్యం

సిజిఆర్‌ఎఫ్ ఛైర్మన్ సత్యనారాయణ

ప్రజాశక్తి - వీరవాసరం

విద్యుత్ శాఖలో అధికారుల వల్ల నష్టపోయిన విద్యుత్ వినియోగదారులకు ఖర్చు లేకుండా న్యాయం జరిగేలా చూడడమే తమ లక్ష్యమని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం ఛైర్మన్ బి.సత్యనారాయణ అన్నారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం వేదికను శుక్రవారం వీరవాసరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సమస్య పరిష్కారం కాకపోతే ముందుగా 1912కు కాల్ చేసి ఫిర్యాదు చేసిన అరవై రోజుల్లోనే సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. విద్యుత్ వల్ల ఏ విధమైన ప్రమాదం జరిగినా నష్టపరిహారం పొందొచ్చన్నారు. పశువులకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. ఆరు గంటలకు మించి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే వినియోగదారుడు పరిహారం కోరవచ్చన్నారు. భూ యజమాని అనుమతులు లేకుండా ఆ ప్రాంతంలో విద్యుత్ పనులు చేపట్టకూడదన్నారు. రెండు సంవత్సరాల వ్యవధిలోని సమస్యలను మాత్రమే తమ దృష్టికి తేవాలన్నారు. మా పరిధిలో మీ సమస్యలు పరిష్కారం కాకపోతే విద్యుత్ అంబుడ్స్‌మెన్, హైకోర్టు వరకూ వెళ్లి పరిష్కరించుకోవచ్చన్నారు. డోర్‌లాక్ అంటూ తనకు అధిక సంఖ్యలో బిల్లు రావడం జరిగిందని మోటుపల్లి రాము తెలిపారు. ఎటువంటి సమాచారం లేకుండా మీటర్లు బిగిస్తున్నారంటూ, కరంటు ప్రమాదాల వల్ల నష్టపోయిన వారి నష్టపరిహారం చెల్లించాలంటూ పలువురు వినియోగదారులు తమ సమస్యలను న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఇ ఎ.రఘునాథబాబు, న్యాయ స్థానం సభ్యులు ఎస్.సుబ్బారావు, ఎన్.మురళీకృష్ణ, వీరవాసరం ఎఇ అప్పారావు, వినియోగదారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సిజిఆర్‌ఎఫ్ ఛైర్మన్ సత్యనారాయణ

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

రోడ్డు భద్రతకు అధికారులు ఎప్పటికప్పుడు పటిష్ట చర్యలు చేపట్టి, ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి అధ్యక్షతన రోడ్డు భద్రత కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, పోలీస్, ఆర్‌డిఒ, ఆర్‌అండ్‌బి, వైద్యశాఖ అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకూ 172 ప్రమాదాలు జరగ్గా, 63 మరణాలు సంభవించాయని, గతేడాది 194 ప్రమాదాలు జరగ్గా, 75 మరణాలు సంభవించినట్లు తెలిపారు. వాహనదారులు హెల్మెట్ వాడకపోవడం, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవ్ చేయడం, త్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, రోడ్ల మలుపు ప్రాంతాల్లో ఎక్కువగా ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా డ్రైవ్ చేయడం, హెల్మెట్ ధరించకపోవడం, మొబైల్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం, త్రిబుల్ రైడింగ్ వంటి వాటిపై 446 కేసులు నమోదు చేసి రూ.38.93 లక్షల అపరాధ రుసుం వసూలు చేసినట్లు తెలిపారు. ఎన్‌హెచ్ 216 లోసరి హైవేలో హైమాస్ట్ లైట్స్ వెలగడం లేదని వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. వెంటనే సరిచేసి 15 రోజుల్లో నివేదిక అందజేయాలన్నారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ సీటు బెల్టు, హెల్మెట్ విధిగా ధరించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జెసి టి.రాహుల్‌కుమార్ రెడ్డి, అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు, జిల్లా రవాణా శాఖ అధికారి పి.ఉమామహేశ్వరరావు, ఆర్‌డిఒలు కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, దాసిరాజు, కతీబ్ కౌసర్ బానో, డిఎస్‌పిలు ఆర్‌జి జైసూర్య, శ్రీవేద, డి.విశ్వనాథ్, ఆర్‌అండ్‌బి అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

ధాన్యం కొనుగోలు చేయాలి

కౌలు రైతుల ఆందోళన

ప్రజాశక్తి - పోడూరు

ఆరుగాలం కష్టపడి, అప్పులు చేసి అధిక పెట్టుబడులు పెట్టి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం దారుణమని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి శెట్టి రామాంజనేయులు అన్నారు. నూక పేరుతో మిల్లర్ల దోపిడీని అరికట్టాలని కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వద్దిపర్రు గ్రామంలో ధాన్యం రాశుల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ పంట మాసూలు చేసి పది రోజులైనా ధాన్యం కొనుగోలు చేయకపోవడం దారుణమన్నారు. ఎంటియు 1153 రకం ముక్కపేరుతో మిల్లర్లు దింపుకోమంటున్నారని, దీంతో వాహనదారులు వాహనాలు పెట్టే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కౌలురైతులు కడిమి ఏసురాజు, మామిడిశెట్టి నాగరాజు మాట్లాడుతూ ధాన్యం మిల్లులకు తీసుకెళ్లాక తేమశాతం పేరుతో వేలాది రూపాయలు కట్టించుకుంటున్నారని, 1153 రకం బస్తాకు 5 కేజీల ధాన్యం ఇస్తేనే దింపుకుంటామని లేపోతే నీ దిక్కున్న కాడ చెప్పుకోండని మిల్లర్లు అంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మిల్లుల వద్ద ఉన్న కస్టోడిన్ అధికారులు గానీ, రైతుభరోసా, మండల వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రామాంజనేయులు మాట్లాడుతూ సమస్యపై పోడూరు మండల వ్యవసాయ అధికారికి ఫోన్ చేస్తే స్పందించలేదన్నారు. దీంతో తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. తహశీల్దార్ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ధాన్యం కొనుగోలు చేస్తామని, రైతులను మోసం చేసే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. కార్యక్రమంలో రైతులు, కౌలురైతులు శీలం నాగేశ్వరరావు, కడలి మోహన్‌రావు, కడిమి వాసు, వడ్లపాటి కృపారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కౌలు రైతులు

త్రైమాసిక పన్ను వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలి

జూన్ 30లోపు చెల్లించకపోతే 25 శాతం పెనాల్టీ విధిస్తాం - జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో త్రైమాసిక పన్ను చెల్లించాల్సిన వాహన యజమానులు వాహన వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలని జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు కోరారు. గత ఏడాది నుంచి అన్ని కార్యకలాపాలు వాహన వెబ్‌సైట్ నేషనల్ సాఫ్ట్‌వేర్ ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహన త్రైమాసిక పన్ను చెల్లించాల్సిన వారు ఈ ఏడాది జూన్ 30వ తేదీలోపు చెల్లించాలన్నారు. లేని పక్షంలో 25 శాతం ఫెనాల్టీతో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వాహన తనిఖీ అధికారి వాహనాలు తనిఖీ చేసిన సమయంలో త్రైమాసిక పన్ను చెల్లించనట్లు గుర్తిస్తే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు, 200 శాతం ఫెనాల్టీ విధించబడుతుందన్నారు. వాహన యజమానులందరూ విధిగా త్రైమాసిక పన్ను చెల్లించాలని సూచించారు. పాఠశాలల యాజమాన్యాలు బస్సు ఫిట్నెస్ ధ్రువీకరణ పొందిన తర్వాత మాత్రమే విద్యార్థులను బస్సుల్లో తీసుకెళ్లాలని తెలిపారు. తనిఖీ సమయంలో ఫిట్నెస్ సర్టిఫికెట్ లేకుంటే వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. వాహన యజమానులు తమ వాహనాలను త్రైమాసిక పన్ను, ఫిట్నెస్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు.



'వల్లూరులో ప్రభుత్వ భూముల ఆక్రమణ'

అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని వల్లూరు గ్రామంలోని వల్లూరు - గుమ్ములూరు రహదారిని ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 337 గల ప్రభుత్వ భూమిని కొంతమంది కబ్జా చేసి ఆ భూమిలో హడావుడీగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆ గ్రామానికి చెందిన కేతా శ్రీనివాసరావు, కుసుమే సత్యనారాయణ తెలిపారు. దీని గురించి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశామని తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ గతంలో 2022లో మండల సర్వేకు ఫిర్యాదు చేయగా అప్పటి నుంచి ఆ భూమిలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదని తెలిపారు. రహదారికి ఆనుకొని ఉండడంతో భూమి విలువ కోట్లల్లో పలుకుతోందన్నారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేపడుతున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నట్లు వ్యవహరిస్తున్నారని, పలుకుబడి ఉన్న వారి కట్టడాలకు ఎలాంటి అనుమతులు లేకున్నా అధికారులు పట్టించుకోవడం ఆవేదన వ్యక్తం చేశారు. అదే సామాన్యులు నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు తీసుకుంటున్నారన్న ఆరోపణలు జనాల్లో వెల్లువెత్తుతున్నాయి. అవినీతికి అలవాటుపడ్డ కొంతమంది అధికారులు వారికి వంతపాడుతూ అక్రమాలను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌ను కూల్చివేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు

క్రీడల్లో మార్టేరు పేరు నిలపాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

దశాబ్దాల కాలంగా బాస్కెట్‌బాల్ క్రీడలో మార్టేరుకు ఉన్న పేరును కొత్త క్రీడాకారులు నిలపాలని టిడిపి మండల అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాసరెడ్డి (బుల్లా) కోరారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని మార్టేరు ఎస్‌విజి జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో మానవత ఆధ్వర్యంలో జరుగుతున్న బాస్కెట్ బాల్ సమ్మర్ క్యాంపును ఆయన సందర్శించారు. శిక్షణ పొందుతున్న సుమారు 70 మంది విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, విద్యార్థి దశలో చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని అన్నారు. క్రీడల ద్వారా మానసిక వికాసం అభివృద్ధి చెందుతుందని, అందుకే వదలండి వదలండి చరవాణి, ఆడండి ఆడండి క్రీడలు అని విలువైన సూచనలు ఆయన చేశారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షులు కర్రి కృష్ణారెడ్డి, వైబిఎ సెక్రటరీ వెలగల నగేష్‌రెడ్డి, మానవత వైస్ ప్రెసిడెంట్ బండి ప్రసాద్, అంతర్జాతీయ క్రీడాకారుడు సత్తి సుబ్బన్నరెడ్డి, ఉపాధ్యాయుడు తేతలి లోకనాథ్ రెడ్డి పాల్గొన్నారు.



క్రీడాకారులకు సూచనలిస్తున్న టిడిపి మండల అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి

త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ అద్భుతం

నిట్ డీన్ వీరేష్ కుమార్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

త్రీడీ ప్రింటింగ్ ఎంతో అద్భుతమైన టెక్నాలజీ అని నిట్ డీన్ డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్ తెలిపారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి సంతోష్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి విచ్చేసిన వీరేష్ కుమార్ మాట్లాడుతూ వస్తువుల నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టేందుకు త్రీడీ ప్రింటింగ్ సాంకేతికత ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీని పలు రంగాల్లో విరివిగా ఉపయోగిస్తున్నారని, విద్యార్థులు ఈ సాంకేతికతపై నైపుణ్యాలను పెంచుకుని సొంతంగా కంపెనీలను ఏర్పాటుచేసే స్థాయికి ఎదగాలని వివరించారు. అనంతరం ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుంచి శిక్షణకు హాజరైన 40 మంది విద్యార్థులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. త్రీడీ ప్రింటింగ్‌పై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో అద్భుత ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆచార్యులు హైమావతి పాల్గొన్నారు.



విద్యార్థులను సత్కరిస్తున్న యాజమాన్యం

సారారహిత గ్రామంగా ఎస్.కొండేపాడు

ప్రకటించిన కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రంలో నాటు సారాయి పారద్రోలుటకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా తాడేపల్లిగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గణపవరం మండలంలోని ఎస్.కొండెపాడు గ్రామాన్ని నేటి నుంచి సారా రహిత గ్రామంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రకటించినట్లు తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఈ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పశ్చిమగోదావరి జిల్లాను నాటు సారాయి రహిత జిల్లాగా ప్రకటించి, గతంలో నాటు సారాయి అమ్మే 8 మంది లబ్ధిదారులను గుర్తించి వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధికు రూ.13 లక్షల లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. అందులో భాగంగా తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సర్కిల్ నుంచి పత్తుల సత్యనారాయణ అను లబ్ధిదారునకు ప్రత్యామ్నాయ జీవనోపాధికు లక్ష రూపాయలు లోన్ రావడం మంజూరు అయిందని సిఐ స్వరాజ్ లక్ష్మి తెలిపారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు కృషి : కలెక్టర్

భీమవరం : మాదకద్రవ్యాల నియంత్రణకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్పి అద్నాన్ నయీం అస్మి సంయుక్తంగా ఎన్కార్డ్(జిల్లాస్థాయి కమిటీ ఫర్ బెటర్ కోఆర్డినేషన్ ఇన్ కంట్రోలింగ్ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నియంత్రణ)పై సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో గంజాయి సాగు నియంత్రణ, రవాణా, అమ్మకం, వినియోగం, అవగాహన, గంజాయికి బానిసలైన వారికి వైద్య సహాయం, పునరావాసం అంశాలపై సమీక్షించారు. జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా అడిషనల్ ఎస్పి వి.భీమారావు, జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి డాక్టర్ ఆర్ఎస్.కుమారేశ్వరన్, జిల్లా రవాణా అధికారి పి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

తెల్లికోడు డ్రెయిన్ పనుల పరిశీలన

ఉండి : తెల్లికోడు మురుగు డ్రెయిన్ పనులు వేగవంతం చేసినట్లు డిసి వైస్ ఛైర్మన్ మంతెన సాయి లచ్చిరాజు అన్నారు. శుక్రవారం ఉండి శివారు రామాపురం వద్ద ఉన్న తెల్లికోడు డ్రెయినేజీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండి-పాములపర్రు ఆయకట్టుల మధ్యలో ఉన్న తెల్లికోడు మురుగు డ్రెయిన్ వద్ద పాములపర్రు పంటకాలువపై ఉన్న అక్విడెక్ట్ పూర్తిగా పాడైపోయి పంటకాలువ ద్వారా వస్తున్న సాగునీరు తెల్లికోడు మురుగు డ్రెయిన్‌లోకి వృథాగా పోతుందని పాములపర్రు రైతులు ఇటీవల తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు దృష్టికి సమస్యను తీసుకువెళ్లానని, ఆయన ఆదేశాల మేరకు తెల్లికోడు డ్రెయినేజీ వద్ద తూరలు ఏర్పాటు చేస్తున్నామని, దీనివల్ల సాగు, తాగునీరు వృథా కాకుండా పటిష్టంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాములపర్రు ఎంపిటిసి, జనసేన మండల అధ్యక్షులు యడవిల్లి వెంకటేశ్వరరావు, యూనిట్ ఇన్‌ఛార్జి గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, కేసన యాదగిరి, కందుల బలరాం, ఇల్లాపు అప్పాజీ, పలువురు రైతులు ఉన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

ప్రజాశక్తి - మొగల్తూరు

కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను సిడిపిఒ బి.ఊర్మిళ అవగాహన కల్పించారు. మండలంలోని గ్రామాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం బాలికలకు కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మొగల్తూరు పంచాయతీ పరిధి గంట పల్లవ పాలెంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయ్ కుమారి, ఎఎన్ఎం కల్యాణి ఉన్నారు.

ఉండి: కౌమార దశలోనే రక్తహీనతను అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఉండి రెండో సచివాలయం ఎఎన్ఎం ఫాతిమా అన్నారు. శుక్రవారం ఉండి రెండో సచివాలయ పరిధిలోని 104వ అంగన్వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫాతిమా చిన్నారులకు రక్తహీనత ఏవిధంగా అధిగమించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు గడి కుసుమ, ముదునూరి ఝాన్సీ, కనకలక్ష్మిపాల్గొన్నారు.

పెనుమంట్ర : సమాజంలో కిశోర బాలికల సహకారం ఎంతో అవసరమని రక్తహీనతను జయించాలని పెనుమంట్ర ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ అంగర కృష్ణకుమారి అన్నారు. మండలంలోని పెనుమంట్ర 3, 8, మార్టేరు 5, 6 నంబర్ల అంగన్వాడీ కేంద్రాల్లో కిశోరి బాలిక ఆరోగ్యం, భద్రత తదితర అంశాలపై జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో ఆమె పాల్గొని అవగాహన కల్పించారు. ఎఎన్ఎస్ కె.సత్య హరిత, ఆర్.రామలక్ష్మి, ఎం.సుధారాణి, ఎఎన్ఎం డి.దుర్గమ్మ పాల్గొన్నారు.

గణపవరం : 11-18 ఏళ్ల కిశోరి బాలికలు రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలని గణపవరం ఐసిడిఎస్ సెక్టార్ సూపర్ వైజర్ పి.తులసి అన్నారు. శుక్రవారం గణపవరం మూడవ సచివాలయంలో జరిగిన కౌమార బాలికలకు పోషకాహారంపై అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ కార్యకర్త బి.రామకోటి, ఆశాలు లక్ష్మీ కిషోరి, బాలికలు పాల్గొన్నారు.

మనోజ్‌కు అభినందన

ఉండి : ఇటీవల విడుదలైన ఎపిఆర్‌జెసి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన మండలంలోని పాందువ్వ గ్రామానికి చెందిన బొడ్డపల్లి మనోజ్‌కు పాందువ్వ మండల పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పిఎస్ఎన్.రాజు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమండ్రి తిరుమల స్కూల్లో పదోతరగతి చదువుతున్న బొడ్డపల్లి మనోజ్ బుధవారం విడుదలైన ఎపిఆర్‌జెసి ఫలితాల్లో రాష్ట్ర ప్రథమ స్థానం సాధించడం అభినందనీయమన్నారు. పదో తరగతిలో 587 మార్కులు సాధించిన మనోజ్ ఎపిఆర్‌జెసిలో 136 మార్కులు సాధించి గ్రామాన్ని రాష్ట్రస్థాయిలో నిలబెట్టడం గర్వించదగ్గ విషయం అన్నారు. మనోజ్ తండ్రి సత్యనారాయణ ఎఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు, తల్లి కళావతి తమ పాఠశాలలోనే సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు, వారిని గ్రామానికి చెందిన పలువురు పెద్దలు అభినందించారని ఆయన తెలిపారు.

చింతపర్రులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పాలకొల్లు రూరల్ : పాలకొల్లు మండలం చింతపర్రు గ్రామ రజకుల పేటలో మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలతో 63 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేశారు. శుక్రవారం కూటమి నాయకులు దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి పాలకొల్లు మండల అధ్యక్షుడు కోరి విజయభాస్కర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్యుత్ లోవోల్టేజ్ సమస్య లేకుండా మొత్తంగా 99 వరకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మంత్రి ఆదేశాలతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాలకొల్లు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని, గత వైసిపి పాలకులు అర్థ రూపాయి పని చేయలేకపోయారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎడి రామకృష్ణ, ఎఇ శ్రీనివాస్, పాముల రఘనీకుమార్, వాసా మల్లికార్జునరావు, పెనుమత్స శ్రీనివాసరాజు, వీరమల్లు శ్రీనివాస్, అండేర్జరరావు, పెద్దిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

నేడు 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర'

తణుకు : ప్రతి నెలా మూడో శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తణుకు పట్టణంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రాధాకృష్ణ మాట్లాడుతూ పట్టణంలోని పాతవూరు 6, 7 వార్డుల్లో నిర్వహించే స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఇన్‌ఛార్జి కలెక్టర్ సూర్యకుమారిలు హాజరవుతారని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో వార్డు ప్రజలతోపాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఎంఎల్ఎ కోరారు.

22న గూడెంలో మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్

తాడేపల్లిగూడెం: రాష్ట్ర ప్రభుత్వ ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈనెల 22న శ్రీవాసవి డిగ్రీ కాలేజీలో మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.లోకమాన్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అమర రాజా, గ్రాండ్ ఆక్వా ఎక్స్‌పోర్ట్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మ, డైకిన్, ఎస్ఎస్ఎమ్మెంట్, బిటిఎస్ మొదలైన ప్రముఖ కంపెనీలలో ఫార్మా అసిస్టెంట్, మెషిన్ ఆపరేటర్, లోన్ ఆఫీసర్, లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్ అకౌంట్ ఎగ్జిక్యూటివ్, స్టోర్ మేనేజర్ వంటి సుమారు 500కు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. 18-35 సంవత్సరాల వయసు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు https://naipum.ap.gov.in లింకులో రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరుకావాలని, ఇతర వివరాలకు ఈ కింది నెంబర్లను ప్రసన్న-70138 96277, రాధిక 944 184 16 22 సంప్రదించవచ్చని తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఉండి : మండలంలోని పాందువ్వ గ్రామంలోని పేకాట స్థావరంపై ఆ క్రమంలో ఉండి పోలీసులు దాడిచేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,940 స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా తెలిపారు.

ప్రతి విద్యార్థినినీ ఝాన్సీలక్ష్మీభాయిలా తీర్చిదిద్దేందుకు కృషి

పది పరీక్ష ఫలితాల్లో టౌన్ ఫస్ట్ మా స్కూల్ దే

ఝాన్సీ లక్ష్మీబాయి మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్ హెచ్ఎం పిబి.శ్రీనివాసరావు



హెచ్ఎం శ్రీనివాసరావును అభినందిస్తున్న ఎంఎల్సి



టౌన్ ఫస్ట్
సిహెచ్. హేమలత


ప్రజాశక్తి - భీమవరం టౌన్

మా స్కూలు పేరులా ప్రతి విద్యార్థినీ చదువుతోపాటు క్రీడల్లోనూ ధైర్యసాహసాలతో ఝాన్సీ లక్ష్మీబాయిలా తయారుచేసేందుకు నిరంతరం కృషిచేస్తామని ఝాన్సీ లక్ష్మీబాయి మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పిబి.శ్రీనివాసరావు అన్నారు. ప్రజాశక్తితో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో విద్యార్థులు 90 శాతం ఉత్తీర్ణత సాధించారని అన్నారు. పదో తరగతి పరీక్షలకు తమ స్కూల్ నుంచి 109 మంది హాజరు కాగా 98 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. వీరిలో 500 మార్కులు 29 మంది విద్యార్థులు సాధించారన్నారు. సిహెచ్.హేమలత 576 టౌన్ ఫస్ట్‌తో పాటు స్కూల్ ఫస్ట్ వచ్చిందన్నారు. పి.గాయత్రి 575 స్కూల్ సెకండ్ సాధించగా ఎం.ప్రజ్ఞశ్రీ 563 మార్కులతో థర్డ్ వచ్చిందన్నారు. ఇంతమంది విజయం సాధించడానికి కారణం తమ ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని తెలిపారు. అదేవిధంగా స్పెషల్ క్లాసుల సమయంలో తల్లిదండ్రులు అందించిన సహకారం కూడా విజయానికి కారణం అయిందన్నారు. స్కూల్లో విద్యార్థులకు సరిపడ ఉపాధ్యాయులు లేరని ఇప్పటికే ఈ విషయాన్ని విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ స్కూల్లో చదివిన విద్యార్థులు ఎంతో మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని అది ఈ స్కూలు ప్రతిభ అని తెలిపారు.

స్కూల్ ప్రత్యేకతలు..

1. అల్లూరి సీతారామరాజు సేవా సంఘం దత్తత
2. గత ఐదు సంవత్సరాలుగా టౌన్ ఫస్ట్ మా విద్యార్థులదే
3. చదువుతోపాటు షటిల్ కోర్టు ఏర్పాటు చేసి షటిల్, ఖోఖో ఆడిస్తున్నాం.

డెంగీ నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి



గణపవరంలో..

పలుచోట్ల జాతీయ డెంగీ దినోత్సవం

ప్రజాశక్తి - ఉండి

డెంగీ నివారణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ బి.సాయిచంద్ర, యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ బిన్నీ శామ్యూల్ అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బి.సాయి చంద్ర, డాక్టర్ బిన్నీ శామ్యూల్ ఆధ్వర్యంలో మండలంలోని సచివాలయాలలోనూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ అవగాహనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ డెంగీ వ్యాధి ఏడీస్ దోమ నుంచి వ్యాప్తి చెందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద మురికి నీటిని నిల్వ ఉంచకూడదన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గణపవరం : ప్రాణాంతకమైన డెంగీ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని గణపవరం పిహెచ్‌సి డాక్టర్లు పి.కిరణ్మయి, కె.ఓంకార్‌నాద్ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక పిహెచ్‌సి ఆధ్వర్యాన సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న కిరణ్మయి ఓంకార నాద్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురికినీరు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ర్యాలీ గ్రామ ప్రధాన వీధులలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు,



పాలకొల్లు రూరల్‌లో..

ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాల శుభ్రతతో డెంగీ వ్యాధి నివారణ అవుతుందని పిప్పర పిహెచ్‌సి వైద్యులు కె.ప్రియాంక, ఐ.శ్రీదివ్య అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పిప్పరలో డెంగీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి జి.వెంకటేశ్వర్లు, పిహెచ్ఎన్‌వి.రత్నకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : పరిశీలించండి, శుభ్రం చేయండి, మూతలు పెట్టండి మూడు పద్ధతులు పాటించండి, డెంగీని నివారించండని వైద్యాధికారి డాక్టర్ వన్యశ్రీ పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా స్థానిక బేబీ సెంటర్‌లో వైద్యాధికారులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ అనిషా, డాక్టర్ వన్యశ్రీ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు పర్యవేక్షణలో శుక్రవారం అవగాహనా సదస్సు, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు, ఆశాలు, అంగన్వాడీ సిబ్బంది, ఆరోగ్య సహాయకులు ఇ.కాంతారావు పాల్గొన్నారు.

కాళ్ల : దోమల వ్యాప్తిని అరికట్టి డెంగీ వ్యాధిని సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కాళ్ల వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ పేర్కొన్నారు. జాతీయ డెంగీ దినోత్సవ ర్యాలీ కాళ్ల పిహెచ్‌సిలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ డి.విజయవతి, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో లంకలకోడేరు సచివాలయం సిబ్బందితో జాతీయ డెంగీ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.నవ్య జీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్ఎన్ పి.ఎలిజిబెత్, పివి.స్వామి, కె.ముత్య వల్లి పాల్గొన్నారు.

126 రకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

తహశీల్దార్ అప్పారావు

గణపవరం : మండలంలో రైతులు పడించిన 126 రకం ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేస్తామని గణపవరం తహశీల్దార్ వై.అప్పారావు శుక్రవారం తెలిపారు. 126 రకం ధాన్యాన్ని కొనుగోలు చేయటంలేదని రైతులు ఆందోళన పడుతున్నారని ప్రజాశక్తి ఆయన దృష్టికి తీసుకెళ్లగా అప్పారావు సమాధానం ఇస్తూ అదేమి లేదని, రైతు పడించిన 126 రకం ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామని, ఈ విషయంలో రైతులు ఆందోళన పడవద్దని చెప్పారు. ఇప్పటికే 39 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసామన్నారు. గోనెసంచులకు ఇబ్బంది లేదని అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామన్నారు. 126 రకం మండలంలో 500 ఎకరాలలో వేసేవారని ఈసారి 3 వేల ఎకరాలలో రైతులు పండించారని అన్నారు. ధాన్యం దిగుమతికి మిల్లు వద్ద ఇబ్బందులు ఉంటే తనకి ఫోను చేయాలని చెప్పారు. రైతు పండించిన ధాన్యం బ్రోకర్ల ద్వారా అమ్మవద్దని, రైతు డైరక్టుగా ధాన్యాన్ని మిల్లుకు తీసుకు వెళ్తే రైతుకి గిట్టుబాటు ధర వస్తుందని చెప్పారు. ధాన్యాన్ని మిల్లులకు తీసుకు వెళ్లడానికి వీలుగా 150 వాహనాలు ఏర్పాటు చేసామని చెప్పారు. మిల్లువద్ద ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తనకి ఫోను చేయాలని తెలిపారు.

చదలవాడ ముత్యాలరావును వ్యక్తిగతంగా తొలగించలేదు

ఎంఇఒ ఎ.ఉషారాణి వెల్లడి

ఆచంట : ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నైట్ వాచ్మెన్‌గా పనిచేస్తున్న వికలాంగులు చదలవాడ ముత్యాలరావును తొలగించారని భార్య సులోచన ఈనెల 10వ తేదీన విలేకరులకు తెలిపిన విషయం పాఠకులకు విధితమే. ప్రజాశక్తిలో నా భర్తను అన్యాయంగా విధుల నుంచి తొలగించారు, నా కుటుంబానికి న్యాయం చేయండి అని వచ్చిన వార్తకు మండల విద్యాశాఖ అధికారి ఎ.ఉషారాణి స్పందించారు. ఆమె భర్త ముత్యాలరావును అన్యాయంగా మండల విద్యాశాఖ అధికారులు తొలగించ లేదని, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు అతని ప్రవర్తన పరిశీలించగా ముత్యాలరావు విధులకు సరిగా హాజరు కావడంలేదని ప్రధానోపాధ్యాయులు అతన్ని పిలిపించి చెప్పడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో కమిటీ సభ్యులు ముత్యాలరావుకు 90 శాతం వికలాంగత్వం ఉన్న కారణంగానే సరిగా విధులు నిర్వహించడం లేదని, ఇలాగైతే పాఠశాల భద్రతకు విఘాతం కలుగుతుందని కమిటీ తీర్మానం మేరకు ముత్యాలరావును పిలిపించి చెప్పిన తర్వాతే అతనిని తొలగించామని ఆమె వివరించారు. వ్యక్తిగతంగా ఎవరూ తొలగించలేదని పాఠశాల కమిటీ ఆమోదం మేరకే ముత్యాలరావును విధుల నుంచి తొలగించడం జరిగిందని ఆమె తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు : కలెక్టర్

భీమవరం : లింగ నిర్ధారణ పరీక్షలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన పిసి అండ్ పిఎన్‌డిటి యాక్ట్, ఎఆర్‌టిఅండ్ సరోగసి యాక్ట్ అమలుపై సమీక్షించి మాట్లాడారు. జిల్లాలోని 159 స్కానింగ్ సెంటర్లను ప్రతి మూడు నెలలకు ఒకసారి పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలన్నారు. అలాగే ఏవిధమైన అనారోగ్య కారణాలు లేకుండా రెండవ కాన్పు, ఇద్దరు ఆడపిల్లలు ఉండి మూడవ కాన్పు అబార్షన్ చేయించుకున్న వారి జాబితాను క్రోడీకరించి విపులంగా సమీక్షించాలన్నారు. అనంతరం దోమల రకాలు వ్యాప్తి చేయు వ్యాధులు, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఎండ తీవ్రతకు గురికాకుండా పాటించాల్సిన జాగ్రత్తలు, డెంగీ వ్యాధి లక్షణాలకు సంబంధించిన కరపత్రాలను, గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా అడిషనల్ ఎస్పి వి.భీమారావు, డిఎంహెచ్ డాక్టర్ జి.గీతా బాయ్ పాల్గొన్నారు.

సాగుకు కార్యాచరణ సిద్ధం చేయాలి : జెసి

భీమవరం : రాబోయే ఖరీఫ్ సీజన్లో జిల్లాలో నాణ్యమైన, స్థానిక వినియోగానికి అనుకూలమైన సాగు రకాలను పండించడానికి కార్యాచరణ సిద్ధంచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో వ్యవసాయ అధికారులతో సమీక్షించి మాట్లాడారు. జిల్లాలో పండిస్తున్న పిఆర్ 126 వరి రకాన్ని ఎగుమతి దారులు, వినియోగదారులు, ప్రాధాన్యత చూపకపోవడం వల్ల ఈ రకాన్ని ప్రోత్సహించకూడదని వ్యవసాయ అధికారులకు సూచించారన్నారు. ప్రత్యామ్నాయ రకాలైన ఎన్ఎల్ఆర్ 3238, ఎన్‌టియు 1293, ఎంటియు 1010, ఎంటియు 1224 వరి రకాలను ప్రోత్సహించాలని అన్నారు. సమీక్ష సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డిఎం సివిల్ సప్లైస్ అధికారి టి.శివరాం ప్రసాద్, డిఎస్ఒ ఎన్.సరోజ, ఎఎస్ఒ ఎం.రవిశంకర్, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి గణపతి రావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి బి.రామాంజనేయ రాజు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల పైపులు తొలగింపు



మరుగుదొడ్ల పైపులను ధ్వంసం చేస్తున్న ఇరిగేషన్ సిబ్బంది

ఉండి : ఉండి ప్రధాన పంట కాలువలోకి విడిచిన మరుగుదొడ్ల పైపుల తొలగింపు కార్యక్రమం యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నట్లు ఉండి డిసి వైస్ ఛైర్మన్ మంతెన సాయిలచ్చిరాజు అన్నారు. శుక్రవారం ఉండి రైల్వే గేట్ సమీపంలోని గాంధీ నగర్ వద్ద మరుగుదొడ్ల పైపులను ఇరిగేషన్ సిబ్బంది అఖిలపక్ష నాయకుల సమక్షంలో తొలగించారు. ఈ సందర్భంగా మంతెన సాయిలచ్చిరాజు మాట్లాడుతూ స్థానిక ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు ఆదేశాల మేరకు డిసి ఛైర్మన్ తోట ఫణి సూచనలు అనుసరించి ఆపరేషన్ సుజల కార్యక్రమాన్ని వేగవంతం చేసామని అన్నారు. ధనిక, పేద తేడా లేకుండా పార్టీతో సంబంధం లేకుండా ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పంట కాలువలోకి పెట్టిన ప్రతి ఇంటి మరుగుదొడ్ల పైపులను ధ్వంసం చేస్తున్నామని, ఎవరైనా భవిష్యత్తులో వీటిని తిరిగి పునరుద్ధరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి పెదపుల్లేరు రహదారి వరకు మరుగుదొడ్ల పైపులను తొలగించామని, మరో రెండు, మూడు రోజులలో చెరుకువాడ శివారు ప్రాంతం వరకు ఉన్న మరుగుదొడ్ల పైపులను, డ్రెయినేజీ పైపులను తొలగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, నాయకులు కందుల బలరాం, కరిమెరక శ్రీనివాస్, కర్రి శ్రీనివాస్, వార్డు సభ్యులు కమతం బెనర్జీ, వైసిపి నాయకులు గొట్టుముక్కల వెంకటకృష్ణ, సిపిఐ ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సనపల శ్రీనివాస్, విహెచ్‌పి జిల్లా అధ్యక్షులు నల్లా ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.


జులై 9న సమ్మె జయప్రదం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - తణుకు

ఈనెల 20న జరగాల్సిన సమ్మె జులై 9కి వాయిదా పడిందని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, ఎఐటియుసి నాయకులు బొద్దాని నాగరాజు తెలిపారు. శుక్రవారం జరిగిన రెండు సంఘాల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని అన్ని జాతీయ కార్మిక సంఘాలు సమ్మె జులై 9కి మార్చడం జరిగిందన్నారు. దేశంలో ఇంత తీవ్రమైన ఆందోళన పరిస్థితులు ఉన్నా, లేబర్ కోడ్స్ అమలు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. లేబర్ కోడ్స్ ద్వారా పని గంటలు మార్చడం, కార్మిక సంఘాల హక్కులు కాలరాయడానికి కేంద్రం ప్రయత్నం చేస్తుందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కార్మిక సంఘాలు అడుగుతుంటే, లేబర్ కోడ్స్ ద్వారా రోజుకి రూ.178 ఇస్తామని చెబుతుందని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని అన్నారు. ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించి, ప్రజలకు అన్యాయం చేస్తుందన్నారు. లేబర్ కోడ్స్ అమలు వల్ల కార్మికులు బానిసలుగా మారుతారని ఆవేదన వ్యక్తంచేశారు. లేబర్ కోడ్స్ విషయంలో టిడిపి, జనసేన కేంద్రానికి మద్దతు ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. జులై 9న జరగబోతున్న జాతీయ సమ్మె లో కార్మికులు, ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి గుబ్బల గోపి, పిఎల్.నర్సింహారావు, ఎఐటియుసి మందుల ముత్తయ్య పాల్గొన్నారు.

నరసాపురం : కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 20న చేపట్టిన దేశవ్యాప్త సమ్మె జులై 9వ తేదీకి మార్చడం జరిగిందని సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు తెలిపారు. స్థానిక మీరా గ్రంథాలయంలో ప్రజాసంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, 8 గంటల పని విధానం, సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనాలు వంటి చట్టాల కోసం సమ్మె వాయిదా పడిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కవురు పెద్దిరాజు, జల్లీ రామ్మోహన్‌రావు, ఎడ్ల చిట్టిబాబు పాల్గొన్నారు.

ఉపాధి కూలి రూ.307 అమలు చేయాలి



తణుకు రూరల్ : తిరుపతిపురంలో నిరసన తెలుపుతున్న కూలీలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉపాధి చట్టంలో పనిచేస్తున్న కూలీలకు కూలి రూ.307 అమలయ్యేలా అధికారులు చూడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. ఉపాధి పనుల పర్యటనలో భాగంగా శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు మండలంలోని చిన్న తాడేపల్లి, కడియద్ద, పుల్లయ్య గూడెం గ్రామాలలో పర్యటించి ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కడియద్ద గ్రామంలో కూలి రూ.210 పడుతుందని అధికారులు చెబుతున్నారని కూలీలు ఆవేదన వ్యక్తంచేశారు. మండుటెండలో పనిచేస్తున్నా ప్రభుత్వం ప్రకటించిన రూ.307 కూలి రావడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఆపైఅధికారులు మీకు కూలి రూ.205, 210 పడుతుందని చెబుతున్నారని వారు వాపోయారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ అధికారులు అలా చెప్పడం సరికాదని, కూలి రూ.307 వచ్చేలా అధికారులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ముచ్చనక్క సత్యనారాయణ, లాయి శివయ్య, పోలుకొండసోమయ్య, కొయ్యల శ్రీను, పనసకాయల వెంకట మహాలక్ష్మి, చెవల వెంకటరమణ, అడప ప్రగడ గంగారత్నం, మంగతాయారు మాట్లాడారు.

తణుకు రూరల్: ఉపాధి హామీలో యాప్ ద్వారా మస్టర్ విధానం తక్షణమే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అత్తిలి మండలం తిరుపతి పురం గ్రామ పంచాయితీ పరిధి శివపురం చెరువులో శుక్రవారం పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూలీలు విషయాలు చెప్పిన అనంతరం వీరభద్రరావు, గోపాలన్ మాట్లాడుతూ ఉపాధి హామీలో ఇటీవల కాలంలో కూలీలపై పని భారం మరింత పెరిగిందని, ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా మస్టర్ విధానం వల్ల పనిచేయడం ఒక భాగం అయితే కూలీలు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడిందని, దీంతో వృద్ధులు, మహిళలు, వికలాంగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు చెప్పుకొచ్చారు. కూలీలకు వేతనాలు చెల్లించాలనే నిబంధన కచ్చితంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంపన రాజు, కొమ్మన వీర రాఘవులు, మీసాల శ్రీనివాసు, రాపాక సత్యవతి, మల్లుల పావని, రాపాక సువార్త పాల్గొన్నారు.

పంచాయతీ అధికారుల ఆదేశాలతోనే కనెక్షన్ల తొలగింపు

విద్యుత్ శాఖ ఎఇ రాంబాబు

కాళ్ల : కాళ్ల లంక రోడ్లో ఉన్న ఇళ్లకు కరెంటు కనెక్షన్ల తొలగింపు పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకే చేసినట్లు విద్యుత్ శాఖ ఎఇ రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ అధికారులు లంక రోడ్లో ఇళ్లు తొలగిస్తున్నామని చెప్పడంతో 2024 డిసెంబర్ 27న పంచాయతీ అధికారుల సమక్షంలో తొమ్మిది కనెక్షన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేశామని పేర్కొన్నారు.

హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన

భీమవరం : రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో రవికుమార్ కళా బృందంతో వీధి నాటకల ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. భీమవరం ప్రకాశం చౌక్‌లో వీధి నాటకం ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత, చిన్న చూపు లేకుండా ఎలా సమాజంలో కలిసి జీవించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోవిందబాబు, కృష్ణా యువజన సంక్షేమ సంఘం ఆర్గనైజేషన్ భీమవరం ప్రాజెక్ట్ మేనేజర్ బి.ప్రసాద్, ఎఎన్ఎం నిర్మలా కుమారి, ఒఆర్‌డబ్ల్యూ శ్రీనివాస్, పీర్ ఎడ్యుకేటర్స్, కళాకారులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు

నరసాపురం: నరసాపురం పట్టణ టిడిపి కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్)ను ఏర్పాటు చేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు విని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ పెరుగుతున్న ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకోవడం, వాటిని తక్షణం పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడం లక్ష్యంగా ఈ వేదిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తమ పూర్తి సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమైక్య ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, మాజీ ఎఎంసి ఛైర్మన్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, నరసాపురం పట్టణ అధ్యక్షులు జక్కం శ్రీమన్నారాయణ, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ పొన్నాల నాగబాబు, నరసాపురం మండల అధ్యక్షులు వాతాడి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

పాలకొల్లు రూరల్: పాలకొల్లు మండలంలోని దగ్గులూరు, సగం చెరువు గ్రామాలలో ఉపాధి పనుల కూలీలకు స్థానిక కూటమి నాయకులు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ఫ్లోర్ లీడర్ శాగ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాల ప్రకారం మండుటెండల్లో పనిచేస్తున్న కూలీలకు చల్లటి మజ్జిగ పంపిణీ చేయడం జరిగిందని తెలియజేశారు.